నమస్తే తెలంగాణ
కామారెడ్డి
5 | నిజామాబాద్, శనివారం 22 మార్చి 2025 | KAMAREDDY

- మాజీ మంత్రి పేరు చెప్పి అనుచరగణం ఇసుక దోపిడీ!
- రెండు నెలల్లో పదుల సంఖ్యలో పట్టుబడిన వాహనాలు
- జరిమానాలు విధించిన సంబంధిత అధికారులు
- మండల స్థాయిలో కొనసాగుతున్న అక్రమాలు
- అక్రమంగా ఒక్క టిప్పర్ నడవట్లేదంటూ ఇటీవల వ్యాఖ్యానించిన ఎమ్మెల్యే

'పెద్దాయన' ఇలాఖాలో ఇసుక దందా!

బోధన్ నియోజకవర్గంలో యథేచ్ఛగా అక్రమ రవాణా

'బోధన్ నియోజకవర్గంలో నాకు తెలిసి.. ఒక్క టిప్పర్ కూడా ఇసుక అక్రమ రవాణా జరగడం లేదు. ఇసుకను అక్రమంగా తరలిస్తే మేము ఊరుకోవడం లేదు. బాధ్యతగా పని చేస్తున్నాం. అనుమతులతోనే ఇసుకను ప్రజల అవసరాల కోసం అందుబాటులోకి తీసుకువస్తున్నాం..' జనవరి 19న నిజామాబాద్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమీక్షలో బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి సుదర్శన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలివి. వాస్తవానికి బోధన్ నియోజకవర్గంలో ఇసుక దందాకు అడ్డూఅదుపులేకుండా పోతున్నది. మంజీరాతోపాటు వాగులు, వంకల్లో అక్రమార్కులు పెద్ద ఎత్తున ఇసుక అక్రమ తవ్వకాలు చేపడుతున్నారు. ఇదంతా స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి తెలియకుండానే గుట్టుగా కొంతమంది ఆయన పేరు చెప్పుకుని ఇసుక అక్రమ రవాణా చేస్తున్నట్లు తెలిసింది.

–నిజామాబాద్, మార్చి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

నియోజకవర్గంలో కొంతమంది అధికార పార్టీ నేతలు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తూ అందినకాడికి దోచుకుంటున్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పని చేస్తున్నామంటూ సీనియర్ శాసనసభ్యుడు చెబుతున్నప్పటికీ తెర వెనుక గుట్టు చప్పుడు కాకుండా అక్రమ వ్యవహారాలు కొనసాగుతుండడం గమనార్హం. ఎమ్మెల్యే వెంట తిరిగే అనుచరగణమే పెద్దాయన పేరు చెప్పుకుని ఇసుక దోపిడీకి పాల్పడుతున్నది. మాజీ మంత్రికి విషయం తెలిస్తే కష్టమని గ్రహించి గుట్టు చప్పుడు కాకుండా ఇసుక దందా నడిపిస్తున్నట్లు సమాచారం. పోలీసులను మచ్చికచేసుకొని ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ విషయాలేవీ సుదర్శన్‌రెడ్డి దరి చేరనీయడంలేదు. ఇందులో భాగంగానే సమీక్షా సమావేశంలో ఒక్క టిప్పర్ ఇసుక కూడా అక్రమంగా తరలివెళ్లడం లేదంటూ బాహాటంగానే చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందని పలువురు పేర్కొన్నారు. ఓవైపు అనుచరులు, మరోవైపు పోలీసులు కలిసి ఎమ్మెల్యేకు తప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నట్లు తెలిసింది.

పట్టుబడిన వాహనాలు..

బోధన్ మండలంలో మంజీరా ఇసుకను అక్రమంగా తలిస్తుండగా వాహనాలు పట్టుబడ్డాయి. జనవరి 19న ఇసుక అక్రమ రవాణాపై సుదర్శన్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేయగా అంతకు ముందు, ఆ తర్వాత పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్లను అధికార యంత్రాంగం పట్టుకున్నది. దీంతో ఇసుక అక్రమ రవాణా జరుగుతున్న విషయంపై స్పష్టత వచ్చింది. జనవరి నుంచి ఇప్పటివరకు బోధన్ మండలంలోనే 40 ఇసుక ట్రాక్టర్లను అధికారులు పట్టుకున్నారు. నవీపేట మండలంలో జనవరి ఒకటిన ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్‌ను తహసీల్దార్ పట్టుకోగా భూగర్భ గనుల శాఖ అధికారులు రూ.30వేలు జరిమానా విధించారు. జనవరి 21న నవీపేట మండలం జన్నేపల్లి వద్ద, ఫిబ్రవరి 2న నవీపేటలో ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ వర్గాలు పట్టుకోగా, మైనింగ్ అధికారులు వాటిపై రూ.5వేల చొప్పున జరిమానా విధించారు. రెంజల్ మండలంలో జనవరి, ఫిబ్రవరి మాసాల్లో మూడు ఇసుక వాహనాలను రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఒక టిప్పర్‌కు రూ.20వేలు, మరో 2 ట్రాక్టర్లకు రూ.3వేలు చొప్పున జరిమానా విధించి వదిలేశారు. ఇసుక అక్రమంగా తరలించకపోతే రెవెన్యూ, పోలీస్ వర్గాలు ఆ వాహనాలను ఎందుకు ఆపేశారని, ఏ కారణంతో జరిమానాలు విధించారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఫిబ్రవరి 14న ఎడపల్లిలో రెండు టిప్పర్లను రవాణా శాఖ అధికారులు పట్టుకున్నారు. ఇసుకతో ఓవర్ లోడ్‌తో వెళ్తున్న వాహనాలపై దృష్టి సారించిన మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు దాడి చేసి కేసులు నమోదు చేశారు. బోధన్, ఎడపల్లి పోలీసులు ఈ వ్యవహారాన్ని పట్టించుకోకపోవడంతో రంగంలోకి రవాణా శాఖ అధికారులు దిగాల్సి వచ్చింది. అనుమతులతో ఇసుకను తరలిస్తున్నామంటూ ఎవరైనా చెప్పుకుంటున్నప్పటికీ ఓవర్ లోడ్‌తో తరలించడం ముమ్మాటికి అక్రమమే.

తప్పుదారి పట్టిస్తున్నదెవరు?

మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డిని సొంత పార్టీ నేతలే తప్పుదారి పట్టిస్తున్నట్లుగా ఈ ఘటనలతో తెలుస్తోంది. వీరిపై ఆధారపడిన ఎమ్మెల్యే మాత్రం ప్రజా బాహుళ్యంలోకి వచ్చినప్పుడు తన నియోజకవర్గంలో అంతా సక్రమంగానే ఉన్నదని, అక్రమాలేవీ జరగడం లేదంటూ చెబుతున్నారు. కానీ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. బోధన్ డివిజన్‌లో ప్రభుత్వం ఏకంగా ఐఏఎస్ అధికారిని సబ్ కలెక్టర్‌గా నియమించింది. ఏసీపీ స్థాయి వ్యక్తి కూడా బోధన్ నియోజకవర్గ కేంద్రంలోనే ఉంటున్నప్పటికీ పరిస్థితి మాత్రం ఘోరంగా తయారైంది. పెద్దాయన ఆదేశాలకు అనుగుణంగా పని చేయడం పక్కన పెడితే.. నియోజకవర్గంలో జరుగుతున్న వాస్తవ వివరాలను అందించడంలో అధికార యంత్రాంగం పూర్తిగా వైఫల్యం చెందుతున్నది. కొత్తగా బోధన్ డివిజన్‌లో పలువురు సీఐలు బదిలీపై వచ్చారు. వీరి ఆధీనంలోనే ఇదంతా ఇష్టారాజ్యంగా జరుగుతోంది. గతేడాది సీపీగా కల్మేశ్వర్ సింగెనవార్ ఉన్నప్పుడు డీజీపీకి నిఘా వర్గాలు పంపిన నివేదికలో బోధన్, బోధన్ రూరల్, రెంజల్ ఠాణాలో పెద్ద ఎత్తున ఇసుక దందా జరుగుతున్నదని నివేదికలు వెళ్లాయి. దీంతో పలువురిపై బదిలీ వేటు పడింది. ఒకవేళ ఇసుక అక్రమ రవాణా జరిగి ఉండకపోతే డీజీపీ ఎందుకు స్పందించినట్లు అనే ప్రశ్న ఉత్పన్నమవుతున్నది. ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి నిఘా వర్గాలు సైతం కనీసం అప్రమత్తం చేయకపోవడం విడ్డూరంగా మారింది.

ధర్పల్లి మండలం వాడి గ్రామంలో కురిసిన వడగండ్లు

బోధన్ మండలం బండార్‌పల్లిలో నేలకొరిగిన వరి పైరు

గాలివాన..

కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

- పిడుగులు పడి ఐదు జీవాల మృత్యువాత
- దెబ్బతిన్న పంటలు.. నేలవాలిన మక్క, వరి పైర్లు
- ఈదురుగాలులతో మామిడి రైతుకు నష్టం

గాంధారి/లింగంపేట/ధర్పల్లి/బోధన్ రూరల్/నిజాంసాగర్/నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి రూరల్/సిరికొండ, మార్చి 21: గాలివాన హోరెత్తించింది. రైతాంగానికి 'అకాల' నష్టం మిగిల్చింది. ఉమ్మడి జిల్లాలో గురు, శుక్రవారాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. కొన్నిచోట్ల వడగండ్లు పడడంతో పంటలు దెబ్బతిన్నాయి. వడ్లతో పాటు మామిడి కాయలు నేలరాలాయి. పిడుగులు పడి ఐదు జీవాలు మృత్యువాత పడ్డాయి. అకాల వర్షంతో కొందరు రైతులు నష్టపోతే, మరికొందరికి మాత్రం లాభం చేకూరినట్లయింది. నీళ్లు లేక ఎండిపోతున్న వరి పైర్లకు ప్రస్తుత వాన జీవం పోసిందని రైతులు చెబుతున్నారు.

గాంధారిలో..

గాంధారి మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. అరగంటకుపైగా దంచికొట్టడంతో రోడ్లు జలమయమయ్యాయి. రాంలక్ష్మణ్‌పల్లిలో శౌరయ్యకు చెందిన మూడెకరాల మక్కజొన్న నేలకొరిగింది. కోత కోసిన మక్కజొన్న మెదలు తడిసి పోయాయి. నాగిరెడ్డిపేట మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో జోరు వర్షం కురిసింది. విద్యార్థులు, వ్యాపారులు, వాహనాదారులు ఇబ్బందులు పడ్డారు.

గేదెలు, గొర్రెలు మృతి

లింగంపేట మండలంలో పిడుగులు పడి రెండు గేదెలు, మూడు గొర్రెలు మృతి చెందాయి. బోనాల్, బాణాపూర్, బాయంపల్లి, మెంగారం, శెట్పల్లి, పోతాయిపల్లి, కోమట్‌పల్లి, లింగంపల్లి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది. పిడుగు పడి లింగంపల్లి గ్రామంలోని సాకలి సాయిలు, గాలెం నారాయణకు చెందిన గేదెలు మృతి చెందగా, పోతాయిపల్లిలోని ఎర్రం రాజయ్యకు చెందిన మూడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి.

నేలకొరిగిన పైర్లు..

సిరికొండ, ధర్పల్లి మండలాల్లో వడగండ్లు పడ్డాయి. దీంతో ధాన్యం నేలరాలింది. పొలాల్లో రాలిన వడ్లను చూసి అన్నదాతలు కన్నీరుమున్నీరయ్యారు. ధర్పల్లి మండలం వాడి, మద్దుల్ తండాల్లో వడగండ్ల వానతో వరి పైర్లు దెబ్బతిన్నాయి. మామిడి కాయలు రాలిపోయాయి. గాలి దుమారానికి వాడి గ్రామంలో వేప చెట్లు విరిగి పడ్డాయి. పంట చేతికొచ్చే సమయంలో ఇలా అకాల వర్షం వెంటాడడంతో రైతు లు ఆందోళన చెందుతున్నారు. బోధన్ మండలంలో గురువారం రాత్రి కురిసిన ఈదురుగాలులతో వరి పైర్లు దెబ్బతిన్నా యి. బండార్‌పల్లి గ్రామ శివారులో చేతికొచ్చిన వరి పంట నేలకొరిగింది. ఎల్లారెడ్డి మండలంలో శుక్రవారం సాయం త్రం ఉరుములు, మెరుపులతోపాటు ఈదురుగాలులు వీచాయి. మండల పరిధిలోని తిమ్మారెడ్డి గ్రామశివారులో బలమైన ఈదురు గాలులకు ఓ విద్యుత్ స్తంభం ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ స్తంభంతోపాటు ఓ చెట్టు కూడా కూలిపోవడంతో పంట దెబ్బతిన్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు, కొద్ది రోజులుగా దంచికొడుతున్న ఎండలతో అల్లాడిపోతున్న ప్రజలకు.. ఒక్కసారిగా చల్లబడిన వాతావరణం ఉపశమనం కలిగించింది. ఆకాశం మేఘావృతం కావడం, చల్లని గాలులు వీయడంతో ఎండ తీవ్రత తగ్గిపోయింది.

తిమ్మారెడ్డిలో ఈదురుగాలులకు ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన ఓ విద్యుత్ స్థంభం

పిడుగు పాటుకు లింగంపల్లి గ్రామంలో మృతి చెందిన గేదె



గాంధారి మండలం రామలక్ష్మణ్‌పల్లిలో నేలకొరిగిన మక్కజొన్న

నాగిరెడ్డిపేట్‌లో వర్షంలో తడుస్తూ బస్సు ఎక్కుతున్న విద్యార్థులు

'పది' పరీక్షలు షురూ

- మొదటిరోజు పరీక్షకు ఉమ్మడి జిల్లాలో 77 మంది గైర్హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా అధికారులు

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని ఓ ఎగ్జామ్ సెంటర్‌లో విద్యార్థులను తనిఖీ చేస్తున్న అధికారులు

కామారెడ్డి/ ఖలీల్‌వాడి, మార్చి 21: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమయ్యాయి. మొదటి రో జు తెలుగు పరీక్ష ఉండగా, ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించారు. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 12,579 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 12,552 మంది హాజరుకాగా, 27 మంది గైర్హాజరైనట్లు డీఈవో రాజు తెలిపారు. జిల్లా కేంద్రంలోని గౌతమ్ ఉన్నత పాఠశాల లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలను ఎస్సీ రాజేశ్ చంద్ర, ఏఎస్పీ చైతన్యారెడ్డి పరిశీలించారు. పరిశీలించారు. నిజామాబాద్ జిల్లాలో పదో తరగతి పరీక్షలకు మొదటి రోజు మొత్తం 22,739 మంది విద్యార్థులకు 22,689 మంది హాజరయ్యారు. 50 మంది గైర్హాజరైనట్లు డీఈవో అశోక్ తెలిపారు. ఆర్మూర్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తనిఖీ చేశారు.

దేవునిపల్లిలో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

దివ్యాంగ విద్యార్థులపై నిర్లక్ష్యం

పరీక్షా కేంద్రాల్లో వీల్‌చైర్ ఏర్పాటుచేయని వైనం

పరీక్షా కేంద్రంలోకి దివ్యాంగ విద్యార్థిని ఎత్తుకుని వెళ్తున్న కుటుంబ సభ్యుడు

బోధన్, మార్చి 25: పదో తరగతి పరీక్షలు రాసే దివ్యాంగ విద్యార్థులకు ఎగ్జామ్ సెంటర్లలో సౌకర్యాలను కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. బోధన్‌లోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల(జేసీ)లో పరీక్ష రాయడానికి వచ్చిన ఓ దివ్యాంగ విద్యార్థిని నిర్వాహకులెవరూ పట్టించుకోలేదు. నిబంధనల ప్రకారం దివ్యాంగ విద్యార్థులకు పరీక్షా కేంద్రంలోని తమ సీటు వరకు వెళ్లేందుకు వీల్‌చైర్‌ను ఏర్పాటుచేయాలి.గ్రౌండ్ ఫ్లోర్‌లోనే పరీక్ష రాసే అవకాశం కల్పించాలి. కానీ రాకాసిపేట్‌లో కేంద్రానికి వచ్చిన మహ్మద్ నయ్యర్ అహ్మద్ అనే దివ్యాంగ వి ద్యార్థికి వీల్‌చైర్‌ను ఏర్పాటుచేయలేదు కదా.. గ్రౌండ్‌ఫ్లోర్‌లో కాకుండా ఫస్ట్‌ఫ్లోర్‌లో పరీక్ష రాయడానికి సీటు కేటాయించారు. దీంతో నయ్యర్ అహ్మద్‌ను అతడి కుటుంబసభ్యుడొకరు ఎత్తుకుని ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉన్న పరీక్షా కేంద్రంలోకి తీసుకెళ్లాడు.

మిగిలింది కొన్ని రోజులే!

నత్తనడకన 'ఉపాధి' పనులు

- నెలాఖరుతో ముగియనున్న ఆర్థిక సంవత్సరం
- వంద రోజులు పూర్తి చేసుకున్న కుటుంబాలు నిజామాబాద్ జిల్లాలో 579, కామారెడ్డిలో 1280 మాత్రమే
- సరాసరి కుటుంబానికి 40 రోజులే పనిదినాలు
- తగ్గనున్న మెటీరియల్ కాంపోనెంట్ నిధులు

బాన్సువాడ రూరల్, మార్చి 21: ఉమ్మడి జిల్లాలో 'ఉపాధి హామీ' లక్ష్యం నీరుగారుతున్నది. ఉపాధి హామీ పథకం నిర్వహణలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తున్నది. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం మరో పదిరోజుల్లో ముగియనుండగా, ఉపాధి హామీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజులు పని దినాలు కల్పించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కామారెడ్డి జిల్లాలో ఒక్కో కుటుంబానికి ఏడాదికి సరాసరి 35 రోజులు, నిజామాబాద్ జిల్లాలో 39 రోజుల చొప్పున పని దినాలు కల్పించడం గమనార్హం. కామారెడ్డి జిల్లాలో 22 మండలాలు (527 పంచాయతీలు) ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.50లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 4.8లక్షల మంది కూలీలు జాబ్‌కార్డుల్లో రిజిస్టర్ చేసుకున్నారు. జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాల్లో 1.78లక్షల కుటుంబాలు (2.91లక్షల మంది కూలీలు) పనులకు వస్తున్నాయి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం 1,280 కుటుంబాలకు మాత్రమే వంద రోజులు కల్పించారు. ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.130 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు దాదాపు రూ.100 కోట్లు మాత్రమే వెచ్చించారు. ఇందులో కూలీలకు వేతనాలు రూ. 77 కోట్లు, మెటిరీయల్ కాంపోనెంట్ కింద దాదాపు రూ.30 కోట్లు చెల్లించారు.

నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ జిల్లాలో 27 మండలాలు (530 గ్రామ పంచాయతీలు) ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 2.56లక్షల జాబ్‌కార్డులు ఉండగా, 4.81లక్షల మంది కూలీలు జాబ్‌కార్డుల్లో రిజిస్టర్ అయి ఉన్నారు. 1.70లక్షల జాబ్‌కార్డు కలిగిన కుటుంబాలు (2.62 లక్షల మంది) మాత్రమే ఉపాధిహామీ పనులు చేస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు కేవలం 579 కుటుంబాలకు మాత్రమే వంద రోజులు ఉపాధి కల్పించారు. ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.170 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు దాదాపు రూ.130 కోట్లు మాత్రమే ఖర్చు అయ్యాయి. ఉపాధిహామీ పనులు నత్తనడకన సాగడంతో మెటిరీయల్ కాంపోనెంట్ కింద వచ్చే నిధులు తగ్గిపోనున్నాయి. మార్చిలో కూలీల సంఖ్య భారీగా పెరగాల్సి ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ కుటుంబాలు వంద రోజులు పూర్తి చేసుకున్నాయి. గతేడాది మార్చి నాటికి నిజామాబాద్ జిల్లాలో 5వేల కుటుంబాలు, కామారెడ్డి జిల్లాలో 2,070 కుటుంబాలు వంద రోజులు పూర్తి చేసుకున్నాయి. ఉన్నతాధికారులు చొరవ తీసుకొని కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఉపాధిహామీ కూలీలు కోరుతున్నారు.

పోచారంపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

- కలెక్టరేట్ ఎదుట బైఠాయింపు
- ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు
- గుర్తింపునివ్వడం లేదని ఆగ్రహం
- పనుల విషయంలోనూ ఇబ్బందులు పెడుతున్నారని మండిపాటు
- కాంట్రాక్టర్ మృతదేహంతో ఆందోళన చేసేందుకు యత్నం
- బాన్సువాడ కాంగ్రెస్‌లో ముదిరిన లొల్లి

ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

కంఠేశ్వర్, మార్చి 21: మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు ధర్నాకు దిగారు. బాన్సువాడ నియోజకవర్గం నుంచి నిజామాబాద్ కలెక్టరేట్‌కు భారీగా తరలివచ్చిన కార్యకర్తలు ఆందోళన నిర్వహించారు. పార్టీలో తగిన గుర్తింపు ఇవ్వడం లేదని, పనుల విషయంలోనూ సతాయిస్తున్నారని మండిపడ్డారు. సుమారు 400 మందికి పైగా కాంగ్రెస్ కార్యకర్తలు పోచారం డౌన్‌డౌన్ అని నినాదాలతో హోరెత్తించారు. పోలీసులు వారికి సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ వచ్చి మాట్లాడడంతో కాంగ్రెస్ నేతలు శాంతించారు.

కాంట్రాక్టర్ మృతదేహంతో కలెక్టరేట్‌కు..

బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన ఓ కాంట్రాక్టర్ గుండెపోటుతో మృతి చెందాడు. అయితే, కాంట్రాక్ట్ పనులు, నిధుల మంజూరు విషయంలో ఒత్తిడికి గురై అతడు గుండెపోటుకు గురయ్యాడని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ శ్రేణులు అంబులెన్స్‌లో మృతదేహాన్ని తీసుకుని నిజామాబాద్ కలెక్టరేట్‌కు వచ్చారు. అయితే, పోలీసులు మృతదేహాన్ని అంబులెన్స్ నుంచి బయటికి తీయకుండా అడ్డుకున్నారు. అలా చేయడం సరికాదని చెప్పడంతో కార్యకర్తలు కలెక్టరేట్ గేటు ఎదుట ధర్నాకు దిగారు.

గ్రామసభల ద్వారానే పనులివ్వాలి..

అనంతరం అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌ను కలిసిన అధికార పార్టీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనులను గ్రామసభల ద్వారానే కేటాయించేలా చూడాలని కోరారు. ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులను అధికారులు ఇష్టానుసారంగా వినియోగిస్తున్నారన్నారు. గ్రామ సభలు నిర్వహించకుండా పనులు చేపడుతున్నారన్నారు. పనులు నిర్వహించే ఏజెన్సీలను నిర్ణయించే విధానాలు కూడా గ్రామసభ తీర్మానాలు చేయకుండా నిబంధనలకు విరుద్ధంగా కేటాయిస్తున్నారని తెలిపారు.